

# కొన్ని బాధాకర సందర్భాలు

మొదట్లోనే చెప్పుకొన్నట్టు ప్రమాదంలో ప్రేక్షకపాత్ర గురించి పత్రికల్లో తరచూ వార్తలు వస్తూనే ఉంటాయి. కానీ కొన్ని సందర్భాలు మాత్రం... సమాజంలో స్తబ్దత ఈ స్థాయిలో ఉందా అనేంత బాధ కలిగిస్తాయి.

**బ్రిటన్** చరిత్రలోనే అత్యంత చిన్నవయసులో హత్యా నేరం రుజువైన వ్యక్తులుగా రాబర్ట్ థాంప్సన్, జోన్ వెనెబుల్స్ అపప్రథ మూటగట్టుకున్నారు. పదేళ్ల వయసున్న ఈ ఇద్దరూ... ఓ రెండేళ్ల పిల్లాడిని షాపింగ్ సెంటర్ నుంచి ఎత్తుకువెళ్లి, చిత్రహింసలు పెట్టి చంపారు. ఆశ్చర్యం ఏమిటంటే ఆ పిల్లవాడి ఏడుపునీ, దెబ్బలనీ దారిపోడవునా చాలామంది చూసినా... ఎవరూ వారిని ఆపకపోవడం.

**అమెరికాలోని** రిచ్‌మండ్ హైస్కూల్ ప్రాంగణంలోనే ఓ విద్యార్థినిని, సాటి విద్యార్థులు రెండుగంటల పాటు అత్యాచారం చేసి చిత్రహింసలకు గురిచేసినా... పక్కనుంచి వెళ్తున్నవారు ఆపలేదు, కనీసం పోలీసులకు సమాచారం ఇవ్వలేదు సరికదా... వీడియోలు తీస్తూ, చప్పట్లు చరుస్తూ ఆనందించడం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది.

**జపాన్‌లో,** జుంకో పురుట అనే అమ్మాయిని కొందరు టీనేజర్లు 40 రోజుల పాటు ఓ ఇంట్లో బంధించి చిత్రహింసలు పెట్టి చంపారు. ఆశ్చర్యం ఏమిటంటే... తనను బంధించిన ఇంటి చుట్టూ ఎన్నో నివాసాలు ఉన్నాయి. ఆ అమ్మాయి అరుపులూ, కేకలూ ఆ ఇండ్లలో ఉన్నవారికీ వినిపించాయి. అయినా కూడా ఎవ్వరూ పోలీసులకు కంప్లయింట్ ఇచ్చే ప్రయత్నం చేయలేదు.

**సింగపూర్‌లో** పియాంగ్ నాడాన్ అనే పనిమనిషిని తన యజమానులు చావగొట్టేవారు. ఆ దెబ్బలతో తను తరచూ ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. అయినా కూడా దారిపొడవునా ఎవరూ ఒక్క మాట అడిగే వారు కాదు, కంప్లయింట్ ఇవ్వనూ లేదు. చివరికి ఆ దెబ్బలు తట్టుకోలేక ఓ రోజు ఆమె చనిపోయింది.




## గుడ్ సమారిటన్ చట్టం!

**రోడ్డు** మీద కళ్ల ముందే ఓ ప్రమాదం జరిగింది. కానీ కాపాడదాం అనుకుంటే మనం చిక్కుల్లో పడతామేమో కదా! అనే అనుమానం లక్షల ప్రాణాలను బలిగొంటున్నది. సాక్షాత్తు భారత ప్రభుత్వ అంచనా ప్రకారమే ఓ పదేళ్ల వ్యవధిలో 13 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతే... వీరిలో కనీసం సగం మంది అయినా సకాలంలో చికిత్స అందితే బతికేవారు. పోలీసుల ప్రశ్నలు, ఆసుపత్రిలో నిబంధనలు, కోర్టుల చుట్టూ తిరగడం... లాంటి ఎన్నో అంశాలు సాటి మనిషిని కాపాడేందుకు అడ్డుపడుతున్నాయని అందరూ గ్రహించారు. అందుకే 'గుడ్ సమారిటన్ లా' పేరిట సాయం చేయాలని పౌరులను ప్రోత్సహించే ప్రయత్నం



జరిగింది. Motor Vehicle (Amendment) Act 2019 లో 134A ప్రకారం ప్రమాద విషయంలో వీరి గోప్యతకు, సాయానికి, వ్యక్తిగత వివరాలకు భంగం వాటిల్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత అన్ని వ్యవస్థలది అని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సాయం చేసిన వ్యక్తులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలనూ అందిస్తున్నది. క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లోపు ఆస్పత్రికి తరలిస్తే రూ.25 వేలు నగదు బహుమతి అందుకోవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది. ఇలా ఎక్కువ మంది బాధితులకు ప్రాణదానం చేసిన వారు రూ.లక్ష దాకా ప్రోత్సాహకం పొందొచ్చు. ఈ తరహా చట్టాలు చాలా దేశాల్లోనే అమలులో ఉన్నాయి. కానీ ఓ నివేదిక ప్రకారం ఇలాంటి చట్టాలు ఉన్నట్టు 84 శాతం మందికి తెలియదు. 59 శాతం మందిని ఇప్పటికీ పోలీసులు తమ అదుపులోకి తీసుకుంటున్నారు. అందుకే గుడ్ సమారిటన్ చట్టాల గురించి అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మన దేశంలో ఏటా మార్చి 30న Good Samaritan Law Day నిర్వహిస్తున్నారు.

## ఆన్‌లైన్లోనూ



**మనం** ఫేస్‌బుక్‌లో ఏదో పోస్టు చూస్తున్నాం. ఇంతలో ఆ పోస్టు పెట్టిన వ్యక్తిని తిడుతూనో, బెదిరిస్తూనో కొన్ని సందేశాలు కనిపించాయి. లేదా సదరు వ్యక్తే నాకు ప్రమాదం పొంచి ఉందంటూ వాపోయాడు. ఇలాంటప్పుడు కూడా బైస్టాండర్ ఎఫెక్ట్ పనిచేయడం ఆశ్చర్యం. మనకు నేరుగా ప్రమాదం లేదని తెలిసినా కూడా అది తప్పని చెప్పేందుకు, ధైర్యాన్ని అందించేందుకు ఎవరూ ఆన్‌లైన్లో కూడా ముందుకు రాకపోవడాన్ని గమనించారు పరిశోధకులు.

